# పులిని చూసి నక్క

"మీరు నాకు ఓ సహాయం చెయ్యాలి" నాయుడుగారు అన్నారు. అతను మా కర్మాగారములో పెర్సనల్ మేనేజర్.

నేను  ఆశ్చర్యముతో చిత్తయిపోయాను. నాయుడుగారు నన్ను సహాయం కోరటమా!

సృష్టి, స్థితి, లయకారకులైన త్రిమూర్తులు ఎవరికి వారే అతిశక్తివంతులని పురాణములలో నుంచి గ్రహించాను. ఆ ముగ్గురూ ఒకే అకారము ధరించి మెలగాలని ముచ్చటపడి నాయుడిగారి రూపంలో మా కర్మాగారములో కనిపిస్తున్నారని, నేను ఉద్యోగంలో చేరిన కొద్ది రోజుల్లోనే తెలుసుకున్నాను.                "నీకు షిఫ్టులో పనిలేదట కదా? అందుకని....."

ఫోను మ్రోగింది. నాయుడుగారు ఫోను ఎత్తారు.

నేను షాక్ తిన్నాను. షిఫ్టులో పనిలేకపోవటమేమిటి? నాయుడు గారి ఉద్దేశమేమిటి?

యదాలాపంగా అతని వైపే చూస్తూ కూర్చున్నాను.

నాయుడుగారి కుర్చీ వెనుక గోడమీద నున్న పులిబొమ్మకు జీవం వున్నట్టే కనపడింది. నోరు తెరచుకొని వున్న ఆ పులి నా మీద పడటానికి సిద్ధముగా వున్నట్టు తోచింది నాకు.

కర్మాగారములో చేరిన మొదటిరోజే నేనా బొమ్మని గమనించాను. కార్మిక సంక్షేమ సత్సంబంధాల శాఖాధికారి గదిలో ఆ బొమ్మ కనబడటం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

"అది వాళ్ళు చేసే పనికి ప్రతీకయే" నా ఆశ్చర్యాన్ని చూసిన ఓ సహోద్యోగి అన్నాడు.

"అంటే......"

"ఏముంది, అస్మదీయులకైతే పులిలా రక్షణ యిస్తాడు, తస్మదీయులకైతే పులిలా మీద పడి పీక్కుతింటారని దాని అర్థం"?

"అస్మదీయులేంటి, తస్మదీయులేంటి?"

అతని మాటలు నచ్చని నేను కోపంగా అన్నాను. "అంతా ఒకటే. ఒకటే చట్టాలు. అందులో తేడాలేమిటి?"

"రోజులు పోతున్న కొద్దీ నీవే తెలుసుకుంటావులే" అతను నెరసిపోయిన మీసం సవరించుకుంటూ అన్నాడు. "మణి సంగతి నీకు తెలీదు కాబోలు"

మణి మా సెక్షన్‌లోనే పనిచేసేవాడట, మంచి మెకానిక్. తిరుగుతున్న యంత్రాల సవ్వడిలో వచ్చే చిన్న చిన్న తేడాలను గుర్తించి సమస్యలని చిటికెలో తీర్చేవాడట. ఉద్యోగంలో బాగా ఎదుగుతాడనీ అనుకునేవారట. కానీ.....

అతని నోట్లో ఏదీ దాగేది కాదు. ఏ విషయమైనా తెలిస్తే పనికట్టుకొని వెళ్ళి పదిమందికి చెప్పేవాడు. చెప్పకపోతే అతనికి నిద్రపట్టేది కాదు. మాట దాచుకోలేకపోవటమే అతని కొంపముంచింది.

నాయుడిగారికి వూరిలో వున్న అవివాహిత బంధము గురించి ఎవరో మణికి చెప్పారట. మణి చెవిలో పడిన ఆ వార్త వేసవి, అడవిలో పడిన నిప్పురవ్వలా అంటుకొని అలా, అలా పాకుకుపోయింది. ఆ మంటలకు తట్టుకోలేక పోయిన నాయుడిగారి గదిలోని పులి బయటకు దూకింది. మణిని వెదకి, వెదకి పీక్కుతింది. అతి సమర్థవంతుడైన మణి పనిలో తప్పులు చేస్తున్నాడని, అందువల్ల కర్మాగారానికి నష్టాలు కలుగుతున్నాయని రికార్డు తిరగబడిపోయింది.

ఆ మాటలు నాకు నమ్మబుద్ధి కాలేదు.

ఉద్యోగస్థుల్ని, వాళ్ళు పనిలో చూపే సమర్థత, అప్రమత్తలను బట్టే ప్రోత్సహించాలని ఎం.బి.ఎ. లో నేను చదివిన పాఠాలకి చాలా విరుద్ధంగా గోచరించింది

మణి విషయం.

"ఎలాగో షిఫ్టులో మీకు పనిలేదుగా" ఫోన్ రిసీవర్ క్రిందపెడుతూ అన్నారు నాయుడుగారు. "మా పనుల్లో కొన్ని మీకు యివ్వాలనుకుంటున్నాను" అతను పైపులో పొగాకు నింపుకున్నారు. "భయపడక్కరలేదు. మీరు చెయ్యగలిగే పనే."

నాకు కళ్లు తిరిగిపోయాయి. అతని మాటల్లో ఏదో అంతరార్థం ఉంటుంది.

"మాకు షిఫ్టులో పనిలేకపోవటమేమిటి సార్!" నేను ధైర్యం తెచ్చుకుని అన్నాను. "అసలే మనుష్యులు తక్కువ"

"అని మీరు చెబితే చాలదు" నాయుడుగారు గట్టిగా పొగపీలుస్తూ అన్నారు. "మనుష్యులు తక్కువని అంటారు. ఉన్న మనుషలను సమంగా వినియోగించుకోరు. పనిని బట్టి మనుషుల నిస్తాముగానీ రేడియోలు వింటానికి కాదు కదా?"

నా గుండె గతుక్కుమంది. అతని ఉద్దేశం నాకర్థమయింది.

మొన్న క్రికెట్ మేచ్ జరిగినప్పుడు రేడియో తెచ్చుకొని, కామెంటరీ విన్నాను. అదీ అతని ఉద్దేశం.

అది చెయ్యరాని నేరమని నేను అనుకోలేదు. ఎందుకంటే నాయుడుగారి సిబ్బంది రోజూ అలవాటుగా డ్యూటీలో రేడియో వింటూ వుంటారు. ముఖ్యమైన కార్యక్రమాలు వచ్చినప్పుడు బోర్డ్ రూమ్‌కెళ్ళి టి.వి. కూడా చూస్తూ వుంటారు.

"ఏమిటలా వుండిపోయావ్. ఏమిటి నీ జవాబు?"

"అది..... అది" నేను మాట్లాడలేకపోయాను.

"నీళ్ళు నమలకు. మీకు పనిచెయ్యటానికి జీతం యిస్తున్నాము, కానీ రేడియో వినటానికి కాదు"

"నిజమే సార్" నాకు ఎక్కడలేని ధైర్యం వచ్చేసింది. "మీరు చెప్పింది నాకే కాదు మీ సిబ్బందికి కూడా వర్తిస్తుంది"

నాయుడు గారి గుండెల్లోని కోపాగ్ని పర్వతం బ్రద్దలయింది. అందులో నుంచి ఎగసిన అగ్గిస్ఫులింగాలతాకిడికి అతని కళ్ళు మెరిసాయి. "ఇంకొకరి విషయం మీ కనవసరం" ఫైలు తెరచి ఓ కాగితం బయటకు తీసారు నాయుడుగారు. "సంతకం పెట్టి అందుకో"

"ఏమిటది?"

"డ్యూటీలో రేడియో వినటం క్రమశిక్షణకు విరుద్ధం. ఇకమీదట క్రమశిక్షణకు విరుద్ధమైన పనులు చెయ్యకూడదనే హెచ్చరిక"

నాకు నోట మాట రాలేదు. కాయితం అందుకొని కేబిన్ బయటకు వచ్చాను.

ఫైలు చూస్తున్నట్టే కనబడుతూ పోకట్ రేడియోనించి పాటలు వింటున్న నాయుడుగారి సిబ్బంది నన్ను చూసి వెటకారంగా నవ్వుతున్నట్టు తోచిందినాకు.

రాఘవీస్ కోకిల జూలై, **1996**